సామాన్యుడి గొంతుకగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 95 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం | 02.08.2025



## మరో తప్పు చేయొద్దు

- రౌడీషీటర్లకు జనగామ సీఐ కౌన్సెలింగ్

3 లో

# అదనపు కలెక్టర్‌కు బాధ్యత

## మూడింటికి ఒకే ఒక్కడు..!

- డీఈవోగా చార్జ్ తీసుకున్న పింకేష్ కుమార్
- ఇప్పటికే లోకల్ బాడీస్, మున్సిపల్ బాధ్యతలు
- అన్నీ కత్తి మీద సామే..!

( మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి : )

జనగామ జిల్లా ముగ్గురు యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ల పరిపాలనలో దూసుకెళ్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే త్రినేత్రులు జిల్లాను ముందుండి నడిపిస్తున్నారు. అంటే ఒక్కో విభాగానికి ఒక్కో అధికారి అన్నమాట.. పరిపాలన దక్షతకు కలెక్టర్ రిజ్వాన్ బాషా.. రెవెన్యూ సిస్టమ్‌ను గాడిలో పెట్టేందుకు రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్.. లోకల్ బాడీ కోసం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఉన్నారు. వీరిలో ఎవరి పని వారిదే కావొచ్చు.. కానీ ఒకే ఒక్కడు మూడు బాధ్యతలు చూడడం ఎంత గగనమో.. ఇప్పుడు లోకల్ బాడీ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అలాంటి పరిస్థితే ఎదురైంది. ఇప్పటికే స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా, మున్సిపల్ ప్రత్యేక అధికారిగా రెండు అతి పెద్ద బాధ్యతలు ఉన్న ఆయనకు తాజాగా మరోటి వచ్చి చేరింది. అదే విద్యా శాఖ.. స్థానిక సంస్థలు అంటే 300 పైగా గ్రామాల బాగోగులు ఆయనే చూడాలి.. మున్సిపల్ ప్రత్యేకాధికారిగా 30 వార్డులకు ఆయనే ఆ సారథి.. ఇక క్రమశిక్షణకు మారుపేరైన విద్యాశాఖకు ఆయనే పెద్దన్న పాత్ర పోషించబోతున్నారు.

### ఏడాదికి ఒకటి..

పర్మార్ పింకేష్ కుమార్ 2023 డిసెంబర్‌లో జనగామ జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతులు చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు ఆయనకు బాధ్యతలు పెరుగుతూనే ఉన్నాయి. ఆయన వచ్చిన తర్వాత సరిగ్గా ఏడాదికి మున్సిపల్ పాలక వర్గం సమయం ముగిసింది. దీంతో 2024 జనవరి 27న ప్రభుత్వం ఆయనను జనగామ మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా నియమించింది. నాటి నుంచి ఆయన ఆ రెండు పదవులకు న్యాయం చేసేందు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పింకేష్ కుమార్ జిల్లాలోని పంచాయతీలను చూసుకుంటూనే జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. ఇదే తరుణంలో ఆయనకు మరో అదనపు బాధ్యత రావడం గమనార్హం.



### మూడు కత్తి మీద సామే...

అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్‌కు అప్పగించిన మూడు శాఖలు కత్తి మీద సామే అని పలువురు నిపుణులు అంటున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఆయన జిల్లాలోని 300పైగా గ్రామాల పాలన చూసుకోవడంతో పాటు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా కేంద్రంలో 30 వార్డులపై దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్యం, రోడ్లు సరిగా లేవని, జిల్లా కేంద్రంలోని బ్రిడ్జిని బాగు చేయాలని ప్రతిపక్షాలు నిత్యం ఏదో చోట ఆందోళనలు చేస్తున్నాయి. మరో వైపు మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల పర్యావేక్షణ.. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల పూర్తి అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్‌కు సవాల్‌గా మారింది. ఇక త్వరలో స్థానిక సంస్థలు రానున్నాయి. విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ జరగబోతోంది. ఈ తరుణంలో ప్రభుత్వం ఆయనకు విద్యా శాఖను కెటాయించడం తలకు మించిన భారమే అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఏ శాఖకు న్యాయం చేస్తారో అనే అనుమానాలు లేకపోలేదు.

### డీఈవోపై ఫిర్యాదులే కారణమా..!

జనగామ విద్యా శాఖను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్కు అప్పగించడం పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం డీఈవో ఉన్న భోజన్న విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతల తర్వాత వచ్చిన పలు ఫలితాల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించింది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా కూడా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. అధికారులను నిత్యం అప్రమత్తం చేసి మెరుగైన విద్య కోసం కృషి చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారిపై కొన్ని రోజుల కింది జిల్లాకు చెందిన ఓ పార్టీ నేత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వారు దర్యాప్తు చేసి విద్యాశాఖను అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్కు అప్పగించినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే జనగామ జిల్లా కాకుండా ఆదిలాబాద్, అసిఫాబాద్ జిల్లాల్లో కూడా విద్యాశాఖ బాధ్యతలను అక్కడి ఐఏఎస్‌లకు అప్పగించారు. దీన్ని బట్టి చూస్తే చర్యల్లో భాగంగా జనగామ డీఈవోను పక్కన పెట్టారా లేదా.. ప్రభుత్వ సాధారణ నిర్ణయంతో బాధ్యతలు మారాయా అనేది తెలియాల్సి ఉంది.



## సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2 లో



## బీసీ ఉద్యమానికి తరలి రావాలి

- ప్రభుత్వ విప్ అయిలయ్య

3 లో

## జనగామ పుర ప్రముఖుడు సుదర్శనం మృతి



- నివాళులర్పించిన నేతలు
- నేత్రదానం చేసిన నాగబండి

3 లో




# పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** 2025-26 సంవత్సరానికి గాను జనగామ జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల బాలబాలికల నుంచి హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో (01) ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ బి. విక్రమ్ కుమార్ తెలిపారు. దరఖాస్తులు పొందుటకు కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్ 25లో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 1వ తారీకు నుంచి పొందవచ్చునని, పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 8వ తారీకు సాయంత్రం 4.30 గంటల వరకు కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకునే బాల బాలికలు తేదీ 01.06.2018 నుంచి తేదీ 31.05.2019 సంవత్సరంల మధ్య జన్మించి ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రము మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కానీ తహసీల్దార్ కార్యాలయం నుంచి కానీ మీ సేవ నుంచి పొందినవి జతపరచాలన్నారు. అదేవిధంగా కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రాలు జతపరచాలన్నారు. గ్రామీణ ప్రాంతం వారు ఒక లక్ష యాభై వేలు ఆదాయం కలిగి ఉండాలని, పట్టణ ప్రాంతం వారు రెండు లక్షలు మించకుండా ఆదాయం కలిగి ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతపరుస్తూ ప్రస్తుత పాస్ ఫోటో దరఖాస్తుపై అంటించాలన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని పెంబర్తిలో ఉన్న సబ్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, సిబ్బంది రిజిస్టర్‌ను, మందుల నిల్వలను పరిశీలించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద ఉన్న లక్ష్యం ఎంత .. ఇప్పటివరకు ఎంతమంది స్క్రీనింగ్ చేశారు. ఎంతమందికి ఎక్స్రే రేలు చేశారు.. అని మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజు ఎంతమంది ఓపీ నమోదు అవుతుంది, ఇప్పటివరకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య లాంటి కేసులను ఏమైనా గుర్తించారా అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం జనగామ పట్టణంలోని హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్, అగ్రోస్ రైతు సేవ కేంద్రం ఫర్టిలైజర్ షాపులను కలెక్టర్ తనిఖీ చేసి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. రైతులకు ఉన్న ఎకరాలను బట్టి యూరియా అమ్మాలని.. అనవసరంగా ఎక్కువ మొత్తంలో యూరియాను అమ్మకూడదన్నారు. అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని.. రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ఏ రోజు ఎంతమంది రైతులకు అమ్ముతున్నారో స్పష్టంగా వివరాలను నమోదు చేయాలన్నారు. తర్వాత జనగామ పట్టణ సుందరీకరణలో భాగంగా హైదరాబాద్ రోడ్డు వైపు జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, అలాగే రెండో వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో ఇసుక, మొరం తదితర అంశాలలో ఏమైన ఇబ్బంది ఎదురవుతుందా అని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటే ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. కలెక్టర్ వెంట వైద్య ఆరోగ్య, వ్యవసాయ, మున్సిపల్ శాఖ అధికారులు ఉన్నారు.



# బీసీ ఉద్యమానికి తరలిరావాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మన చౌరాస్తా :** ఈనెల 5 , 6, 7వ తేదీల్లో ఢిల్లీలో జరగబోయే బీసీలకు 42 శాతం శాతం రిజర్వేషన్ సాధన ఉద్యమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దఎత్తున్న బీసీ బిడ్డలు తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం శాతం రిజర్వేషన్ లను కల్పించాలనే డిమాండ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ నెల 5 నుంచి 7వరకు ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయబోతున్నామన్నారు. 5న ఈ సమస్యపై పార్లమెంట్‌లో విపక్ష ఎంపీలతో కలసి పార్లమెంట్ వాయిదా తీర్మానం చేయిస్తామన్నారు. ఆగస్టు 6న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు.7న బీసీ బిల్లు ఆమోదం కోసం అందరం కలిసి రాష్ట్రపతిని కలసి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ బీసీ ఉద్యమానికి తెలంగాణ రాష్ట్ర నుంచి బీసీ బిడ్డలు పెద్ద ఎత్తున తరలిరావాలని అయిలయ్య పిలుపునిచ్చారు.

# బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలి


**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలోని గానుగుపహాడ్, చీటకొడూరులో బ్రిడ్జీలను వెంటనే నిర్మించాలని జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ కోరారు. పట్టణంలోని జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఐదు రోజులు దీక్షలు చేపడుతున్న బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్‌కు ఆయన మద్దతు తెలిపారు. శుక్రవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ జనగామ మండలం గానుగుపాడు, చిటకోడూర్ బ్రిడ్జి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఒక సమస్యపై రిలే నిరాహార దీక్షలు చేసిన ప్రభుత్వం అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కోయాడ రవి, పండుగ నరేష్, నల్ల వినోద్, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు పాల్గొన్నారు.






# కలెక్టర్‌ను సన్మానించిన జనగామ మైనార్టీ నాయకులు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా విద్యా రంగంలో గొప్ప పురోగతి సాధించింది. దేశ వ్యాప్తంగా విడుదలైన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) ఫలితాల్లో జనగామ జిల్లా 50వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో జిల్లాలో విద్యా వ్యవస్థను సమర్థంగా పర్యవేక్షించి, పాఠశాలలు, కళాశాలలు సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా సేవలను గుర్తించి ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం శాలు వాతో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ నిబద్ధత, పర్యవేక్షణ వల్లే జిల్లాకు ఈ గౌరవ ప్రద స్థానం లభించిందని కొనియాడారు. విద్యా రంగాన్ని అభివృద్ధి చేసే విధంగా తీసుకున్న చర్యలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హంసాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ యాకుబ్ పాషా, మజీద్ అధ్యక్షుడు మహమ్మద్ మోహినుద్దీన్, ఇమామ్ ఇమ్రాన్ అహ్మద్, నాయకులు అక్బర్ భాయ్, ఆసిఫ్, జావిద్, నిజాం, సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ 'రియల్ మార్గదర్శి'

- స్థిరాస్తి మార్గదర్శి పుస్తకావిష్కరణలో వక్తలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** రియల్ ఎస్టేట్ రంగం పట్ల పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవడానికి 'స్థిరాస్తి మార్గదర్శి' పుస్తకం ఎంతగానో దోహద పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ నిపుణులు కుడికాల ఓం ప్రకాష్ రచించిన 'స్థిరాస్తి మార్గదర్శి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నాగోల్ లోని తెలుగు అసెట్స్ కార్యాలయంలో జరిగింది. కొత్తగా స్థలం కొనాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, ఏదైనా అపార్ట్మెంట్ ఎంపిక చేసుకోవాలన్నా పేరుకు తగ్గట్టే ఈ పుస్తకం ఒక మార్గదర్శిగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికి సులువుగా అర్థమయ్యే విధంగా పుస్తక రచయిత ఓం ప్రకాష్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయితతో పాటు తెలుగు అసెట్స్ యూట్యూబ్ ఛానల్ శ్రీనివాస్ చీకటి, రియల్ ఎస్టేట్ నిపుణులు సామల అంజయ్య, సీనియర్ జర్నలిస్ట్ సప్తగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న సదరం విభాగాన్ని సంబంధిత వైద్యాధికారులతో శుక్రవారం సందర్శించారు. హాస్పిటల్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పేషెంట్లకు ఇబ్బందులు కలగరాదన్నారు. వైద్య అధికారులు పర్యవేక్షిస్తూ పేషెంట్లకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సదరం విభాగాన్ని పరిశీలించారు. సదరం యూడీఐడీ పొందేందుకు వచ్చే దివ్యాంగులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, అందుకు తగిన పనులు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. దివ్యాంగులు సులభతరంగా పరీక్షలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల పర్యవేక్షకులు రాజలింగం గోపాల్ రావు, డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.







# జనగామలో పోలీసుల విస్తృత తనిఖీలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో సీఐ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 18 మందితో ఓవర్ లోడుతో వెళ్తున్న మినీ ట్రక్కును నిలిపి డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో వాహనాన్ని సీజ్ చేశారు. అందులో ప్రయాణిస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి డ్రైవర్ పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా జనగామ చౌరస్తాలో సరైన వాహనా పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలని వాహనం వెంట ఉంచుకోవాలని తెలిపారు. తనిఖీలలో ఎస్సైలు



రాజేష్ కుమార్, చెన్నకేశవులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మరో తప్పు చేయొద్దు

'ఇప్పటికే పలు కేసుల్లో ఉన్నారు.. మరో మారు తప్పు చేయొద్దు.. జాగ్రత్తగా ఉండి..' అంటూ జనగామ సీఐ దామోదర్ రెడ్డి హెచ్చరించారు. జనగామ పీఎస్ పరిధిలో రౌడీ షీట్ నమోదైన 11 మందికి సీఐ దామోదర్‌రెడ్డి శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ ఏమైనా నేరాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుమంటామని హెచ్చరించారు.





### తనిఖీలు..

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం స్కూల్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను వివిధ శాఖల చెందిన అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, వారికి అందజేస్తున్న మధ్యాహ్నం భోజన తయారీని పరిశీలించారు.







# జనగామ పుర ప్రముఖుడు నాగబండి సుదర్శనం మృతి

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మందికి అనేక విధాలుగా అనేక సందర్భాలలో సహాయ, సహకారాలు అందించిన గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి నాగబండి సుదర్శనం ( 92) శుక్రవారం ఉదయం మృతి చెందారు. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సుదర్శనం చనిపోయిన తర్వాత కూడా నేత్ర దానం చేసి ఇరువురికి చూపు కల్పించిన సేవా మూర్తి. కుటుంబ సభ్యుల అనుమతి మేరకు సుదర్శనం నేత్రాలను స్వీకరించిన ఎల్. వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రతినిధులు ధృవ పత్రం ఆయన కుమారులకు అందజేశారు. సుదర్శనం మృతి వార్త తెలిసిన వెంటనే అనారోగ్యంతో ఉన్నా శాసన సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి హైదరాబాద్ నుంచి కాల్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ గుప్త, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, ఛాంబర్ అధ్యక్షుడు పోకల లింగయ్య, లయన్స్ మాజీ గవర్నర్లు డా. డి.లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు, లయన్స్ నాయకులు అల్లాడి ప్రభాకర్ రావు, ఏ.బిక్షపతి, కె రాజశేఖర్ రెడ్డి, ఇ ప్రభాకర్ రెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలా జనార్దన్ కాంగ్రెస్ పార్టీ పలువురు సీనియర్ నాయకులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు సంస్థల ప్రతినిధులు సుదర్శనం మృతి పట్ల సంతాపం ప్రకటించి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


### పరామర్శించిన పొన్నాల..

జనగామ పట్టణానికి చెందిన ప్రముఖులు, జీడికల్ రామచంద్రస్వామి దేవాలయం మాజీ చైర్మన్ నాగబండి సుదర్శనం మరణవార్త తెలుసుకుని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం జనగామ పట్టణంలో వారి స్వగృహంలో నాగబండి సుదర్శనం భౌతిక ఖాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సుదర్శనం కుమారులు నాగబండి రవీందర్, ఉపేందర్‌ను పరామర్శించి ఓదార్చారు. పొన్నాల వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, ఎండీ మాజీద్, బిజ్జల నవీన్ కుమార్, యాకుబ్ పాషా, సౌడా మహేష్, ఆనంతుల ఆంజనేయులు, రాజ్ కుమార్, తుంగ సతీష్, ఎండీ ఆజమ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ నేత జన్మదినం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈదులకంటి ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆయనను శాలువలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, సిద్ధిరాంరెడ్డి, అజీమ్, జావీద్, సుధాకర్ రెడ్డి, షబ్బీర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ పడిగెల కర్ణాకర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో  జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు-, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు-డు శివరాజ్ కుమార్‌తోపాటు-, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.

మన చౌరాస్తా
The Complete News way
02.08.2025 శనివారం
Mana Chourasta





## 'మహావతార్'కు నీరాజనం

పౌరాణిక పాత్రలకు తిరుగులేదని  మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడిరచారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ర్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.



'యోగి ఆదిత్యనాథ్' బయోపిక్‌కు

## సెన్సార్ బ్రేక్‌లు

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటుడు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడిరచింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల  ఎనిమిదేళ్లుగా ప్రజలకు అందుబాటు-లో ఉన్నప్పుడు ఎటు-వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్టును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.